# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

**August - 2000**

# సంక్షిప్త వార్తలు

2000 సంవత్సరము జూలై 3నుండి 6వరకు బిక్కవోలు బైబిలు స్కూలు ఆధ్వర్యమున 11వ వార్షిక బైబిలు లెక్చరర్‌షిప్ జరిగినది. దీనిలో అమెరికా నుండి వచ్చిన సహో. డేమన్ విన్సెంట్ గారు, ఇంకో 18మంది భారతీయ బోధకులు పాల్గొని వాక్య పరిచర్య చేసిరి. వారెవరనగా, పి.దీన్‌దయాళ్ బిషప్, యం. సూరిబాబు, ఎ.విశ్వేశ్వరరావ్, జి. విజయ కుమార్, ఎ.డి. వినయానంద్, జాషువాగూటం, యం. సూర్యరావ్, బి. రత్నం, పి.యస్.ఆర్. జయపాల్, పి.గోపాలరాజు, కె.జి. కుమార్, బి. రాజేంద్ర, యస్. జాన్, బి.ప్రసాద్, వి. రాజ్‌కుమార్, టి.వి.యస్. కుమార్ మరియు పి. ఐజక్. రోమా పత్రికపై ఆధారపడి "దేవుని నీతి" యను అంశమును పలుకోణముల నుండి సోదరులు ఉపదేశించిరి. బిక్కవోలు బైబిలుస్కూల్ డైరక్టర్ యస్. జాన్‌గారు, వారి బృందం చక్కటి ఏర్పాట్లు చేసిరి. ఈ ఉపన్యాస కూడికలు జయకరముగా నడిపించబడినందుకు అందరు దేవునికి స్తుతులు చెల్లించిరి.

జూలై నెల 15,16,17,18 తేదీలలో భీమవరం నెహ్రూ కోలనీలో గల క్రీస్తు సంఘ ఆధ్వర్యంలో సువార్త కూటములు జరిపించబడెను. కరుగోరుమిల్లిలో సువార్త పని చేయుచున్న సోదరులు యన్.మోజెస్ గారు, వారి కుమారుడు రవికుమార్ గారు వాక్య పరిచర్య చేసిరి. స్థానిక సువార్తికులు బి. జోషీరావ్ గారు కూడ వాక్య పరిచర్యలో పాల్గొనిరి. ఈ సువార్త కూటముల ఫలితముగా 16వ తేదీ ఆదివారమున ఇద్దరు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

జూలై 27వ తేదీ గురువారం తూర్పు గోదావరి జిల్లా తొండంగి మండలం బెండపూడి గ్రామంలో సువార్తికుల సదస్సు జరిగెను. పలు ప్రాంతముల నుండి సువార్తికులు కూడి రాగా బెండపూడి క్రీస్తు సంఘ ఆవరణములో సకాలమునకు సదస్సు ప్రారంభమాయెను. సోదరులు పి.యేసురత్నం (పెద్దాపురం), కె.ప్రసాద్ (ఆచంట), యన్. రవికుమార్ (కరుగోరుమిల్లి), యం. జోసఫ్ (పెనుమంచిలి) చక్కటి పాటలు నడిపించిరి. పిఠాపురం సీతయ్యతోట సువార్తికులు వి.యేసు, కందరాడ నుండి వచ్చిన పిట్టా రాజారెడ్డి గార్లు ప్రార్థనలు చేసిరి.

సోదరులు యన్.మోజెస్ (కరుగోరుమిల్లి), యల్. వీర్రాజు (దేవరపల్లి), గుమ్మడి ఇశ్రాయేలు (లక్ష్మీపోలవరం), వై. రత్నరాజు (పోతవరం), కె. దామోదరరావ్

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box 80, Kakinada, A.P. 533 001

Phone : 0884 - 363722

Editor :

**JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 21 ఆగస్టు 2000 సంచిక 1


## బైబిలు నిజమా ?

( Is the Bible True ? )

"ప్రవచనము ఎప్పుడుమ మనుష్యుని ఇచ్ఛను బట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడిన వారై దేవుని మూలముగ పలికిరి" (2పేతురు 1:21).

### నేను బైబిలును నమ్ముదును

బైబిలును విశ్వాసము వలన నేనంగీకరింతును. నేను మరణానంతరము జీవించుదునని అది బోధించుచున్నది. నేనొక శ్రేష్టమైన గృహమునకు వెళ్ళదలచుకొంటిని, నాకంటె ముందు వెళ్ళిపోయిన మిత్రులను, బంధువులను కలపికొవ వలెనని నేననుకొనుచుంటిని. బైబిలు నిజమని నా చిన్న తనమునుండి నాకు బోధింపబడినది. గతంలో యున్న గొప్ప పురుషులు బైబిలును అంగీకరించిరి. దానిని నమ్మ కుండుటకంటే, నమ్ముటయే సులువు.

# నేను దేవుని నమ్మెదను

నాస్తికత్వము నిరూపింపబడలేదు. దేవుడు లేడని తెలిసికొనుటకు ఒకడు సమస్తమును ఎరిగియుండవలెను. దేవునియందు నమ్మిక యుంచుట చాల యోగ్యమైనది. దేవుడు లేడని నమ్ముట చాల అయోగ్యమైనది. ఆయన ఉనికిని గూర్చి ఈ విశ్వమే సాక్ష్యమిచ్చుచున్నది. ప్రతియిల్లును ఏదైనా ఒకనిచే నిర్మింపబడి యున్నది. గడియారమును తయారు చేసిన జ్ఞాని అంటూ ఒకడున్నాడు. దేవుడు చేసిన వాటిని బట్టి దేవుని గూర్చి మన మెరుగుదుము. ఆకారమును, ప్రకృతిని మరియు ఒక పసిబిడ్డ ముఖమును ఒకసారి తిలకించి దేవుని పరికించుము. దీని యంతటి వెనుక ఒక గొప్ప నమూనాకారుడు(Designer), సాంకేతిక విజ్ఞాన కోవిదుడు ఉన్నాడు. ఇట్టి విశ్వాసము లేకపోతే దీని గత్యంతరము ఏమిటి ? నిరీక్షణ శూన్యము, జీవించుటకు గల లక్ష్యము సున్న. అది ఎంత భయంకరమైన నిర్జీవమైన దృశ్యమో !

దేవుని చూపించు, నేను నమ్మెదను అనిచెప్పుచు కొందరు వాదించుదురు. నీ మెదడు చూపించు, అప్పుడు నీకు కొంత మెదడున్నదని నమ్మెదను ! గాలిని చూపించు అపుడు దానిని నమ్మెదను. మహాత్మగాంధిని చూపించు అప్పుడాయన జీవించాడని నేను నమ్మెదను. మనము ప్రాణాన్ని గాక దాని ఫలములను చూచు చున్నాము. అట్లే నీ మెదడు యొక్కయు, గాలియొక్కయు, గాంధి యొక్కయు పనిని మనము చూడగల్గు చున్నాము. దేవుడు చేసిన వాటిని బట్టి మనమాయనను చూడగల్గుదుము. ఆయన ఉనికిని గూర్చిన ఋజువులను ప్రతిచోట మనము చూచుచున్నాము.

కాలారంభము నుండి నిత్యత్వమే వరకు బైబిలు మన మార్గదర్శియై యున్నది (కీర్త 119:105). అది ఎన్నడు నాశనము గావించబడదు (మత్తయి 24:35). ప్రతి సత్కార్య మునకు అది సంపూర్ణమైయున్నది (2తిమో 3:16). అది దేవుని నుండి కలిగినది (హెబ్రీ 1:1,2). అది మానవుని ఆద్యంతములను,అతని కృషిని, గమ్యమును బయలు పరచు చున్నది. మరో గ్రంధమేదియు వీటిని బయలు పరచ లేదు. అది కాల పరీక్షలను జయించినది. వోల్టయిర్, పేయిన్, ఇంగెరుసాల్ లాంటి వ్యక్తులు దానిని నాశనము చేయబూని విఫలులైరి.

బైబిలు 40 మంది లేఖకులచే 1600 సంవత్సరములలో వ్రాయబడెను. అది ఒకే సంపుటియైనను దానిలో 39 పుస్తకములు గల పాత నిబంధన, 27 పుస్తకములు గల క్రొత్త నిబంధన యున్నది. దాని లేఖకులలో రాజులు, గొల్లలు, సైనికులు, జాలరులు, వ్యవసాయకులు కలరు. అది రాజభవనములలోను, గొల్లల గుడారములలోను, చెరసాల గదులలోను వ్రాయబడెను. బైబిలు లేఖకులు అందున్న వ్యక్తుల మంచి చెడులను రెంటిని గూర్చి తెలియ చేసిరి. అబ్రహాము, నోవహు, దావీదు, మోషే, పేతురులాంటి వారిని గూర్చి ఉదాహరణగా ఆలోచించుము. ఆయావ్యక్తుల లో ఎన్ని వ్యత్యాసములున్నను బైబిలు అంతయు ఒకేగ్రంథమై యున్నది. దానిలో స్వవిరుద్ధ సంగతులేమీ లేవు.

దాని నైతిక ప్రభావము దేశ దేశాలకు ప్రబలియున్నది. నాగరికత పయనించ వలసిన త్రోవను అది చూపించినది. మానవ స్వాతంత్ర్యమునకు మద్దతు ఈయ బడినది. కృషియే గౌరవమనే సంగతి గుర్తించబడినది. కళా సాహిత్యములు, విద్య మొదలగునవి విస్తరించబడెను. దీనియంతటికిని తప్పక ఒక కారణముండ వలెను. అదేమంటే బైబిలు దేవుని నుండి కలిగెను !!!

## బైబిలు రక్షణ సంకల్పమును బయలు పరచుచున్నది

"మనుష్యుని ద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానము కలిగెను. ఆదాము నందు అందరు ఏలాగు మృతిపొందుచున్నారో, ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రతికింపబడుదురు" (1కొరింథీ 15:21-22). అది ఏదేను నుండి పరదైసు వరకు చెప్ప బడుచున్న కథ. అది కథలన్నిటికంటే ప్రఖ్యాతిగాంచినట్టిది. అది మర్త్యుడగు మానవుడు ముందెన్నడు విననట్టి గొప్ప వర్తమానము. క్రీస్తురక్తముఇమిడియున్న ఈకథలో మానవుడు రక్షింపబడవలెనంటే విశ్వాసముంచవలెనని (యోహా 8:24), మారుమనస్సు పొందవలెనని (లూకా 13:3), క్రీస్తును ఒప్పు కొనవలెనని (రోమా 10:10), మరియు బాప్తిస్మము పొందవలె నని బయలు పరచబడియున్నది (అ.కా. 2:38).

## తీర్పుతీర్చు స్థాయి అది

"మరియు గొప్పవారేమి కొద్దివారేమి మృతులైన వారందరు ఆ సింహాసనము ఎదుట నిలువబడి యుండుట చూచితిని. అప్పుడు గ్రంథములు విప్పబడెను. మరియు జీవగ్రంథమను వేరొక గ్రంథము విప్పబడెను; ఆ గ్రంథముల యందు వ్రాయబడి యున్న వాటిని బట్టి తమ క్రియల చొప్పున మృతులు తీర్పు పొందిరి" (ప్రక 20:11,12). ఆ దినమందు ఒక్కొక్కరి పేరు పిలువబడు చుండగా మనంద రము అక్కడయుందుము. ఇప్పుడు బైబిలులో ఏమి వ్రాయ బడియున్నదో అపుడు కూడ అదే వ్రాయబడి యుండును. దాని పరిశుద్ధ ఆజ్ఞలయెడల మనకున్న భావమును బట్టి మనందరి నిత్యగమ్యము నిర్ణయించ బడును.

బైబిలు దాగలి వంటిది. గత సాయం సమయమున కంసాలవాని గుమ్మము దగ్గరనుండి వెళ్ళుచు వాని దాగలి నుండి వచ్చుధ్వనిని వింటిని. లోపలికి తొంగి చూచి అనేక సంవత్సరముల కాలమునుండి వాడబడి అరిగిపోయిన సుత్తెలు నేలమీద పడి యుండుట చూచితిని. 'ఇన్ని సుత్తెల ను పడగొట్టుటకు నీవు ఎన్ని దాగళ్ళు ( anvils ) వినియోగించితివి ? యని నేనతనిని అడిగితిని'. 'ఒకే ఒక్కటి! దాగలి సుత్తెలను అరుగగొట్టి పడగొట్టును కదా' యని అతడు ప్రశ్నించు చూపుతో జవాబిచ్చెను. అట్లే దేవుని వాక్యమనే దాగలిపై సందేహాశీలురి దెబ్బలు తరములబడి పడుచునే యున్నవి. పడుచున్న దెబ్బల శబ్దము వినబడు చున్నను, దాగలికి హాని యేమియును కలుగలేదు. గాని సుత్తెలు పడిపోయెను అని నేనను కొంటిని".

## బైబిలులో . . . .

బైబిలులో దేవుని చిత్తము, మానవుని స్థితి, రక్షణ మార్గము, పాపుల నాశనము, విశ్వాసుల సంతోషము బయలు పరచబడి యున్నవి. దాని బోధ పరిశుద్ధమైనది. ధర్మవిధులు బద్ధమైనవి. దాని చరిత్రలు యదార్థములు, దాని నిర్ణయము లు స్థిరములు. జ్ఞానివగుటకు దానిని చదువుము, సురక్షితుడ వగుటకు దానిని విశ్వసించుము. పరిశుద్ధుడవగుటకు దానిని పాటించుము. నిన్ను

నడిపించుటకు దానిలో వెలుగు, పోషించుటకు ఆహారము, సంతోషపెట్టుటకు ఆవరణయు ఉన్నది. అది ప్రయాణీకుని మార్గదర్శి, యాత్రికుని దండము, నావికుని దిక్సూచి, సైనికుని ఖడ్గము, క్రైస్తవుని రాజశాసనము. దానిలో పరలోకము తెరువబడెను. నరక ద్వారములు కను పరచబడెను. క్రీస్తుదాని గొప్ప అంశము, మన మేలు దాని సంకల్పము మరియు దేవుని మహిమయే దాని ధ్యేయము. అది మన మనస్సులో నింపబడవలెను, హృదయమును ఏలవలెను. మన పాదములను నడిపించవలెను.

దానిని నెమ్మదిగా, జాగ్రత్తగా, ప్రార్ధన పూర్వకముగా చదువుము. అది సంపదలగని, ఆత్మకు ఆరోగ్యము, ఆనంద నది. అది ఇక్కడ ఈ జీవితంలో నీకీయబడినది, తీర్పులో తెరువ బడును మరియు నిత్యము స్థిరముగా యుండును. దానిలో అత్యున్నతమైన భాద్యత, అత్యుత్తమ పరిశ్రమకు ఫలితము ఇమిడియున్నవి. మరియు దాని విషయములను నిర్లక్ష్యము చేయువానినది ఖండించుచున్నది.

- జార్జి డిహోఫ్.

## బైబిలు గ్రంధకర్త యెవరు-1 ?
### ( Who is the Author of the Bible-1 ? )

బ్రహ్మాండమైన ఈ విశ్వము వెనుకనున్న గంభీరవ్యక్తి దేవుడని మనము ఎరుగవలసి యున్నది. సృష్టికంతకును కర్తయైనవాడు బైబిలుకు గ్రంధకర్తయో కాదో నిర్ణయించు టకు ఈ రోజు ప్రయత్నించెదము.

దైవావేశము కలిగిన మనుష్యులచే లిఖింపబడినట్లు రోపింపబడిన 66 పుస్తకముల కలయికయైన బైబిలు మన కున్నది. అన్ని గ్రంధములకు వలె దీనికి ఒక గ్రంధకర్త యున్నాడనునది అందరూ అంగీకరించినదే. అయితే ఆ గ్రంధకర్త యెవరు ? మానవుడా ? లేక దేవుడా ?

బైబిలు మిత్రులు దేవుడే దానికి గ్రంధకర్తయని, ఆయన మనుష్యులతో పరిశుద్ధాత్మద్వారా మాటలాడగా వారు దానిని లిఖించిరని నమ్ముదురు. అయితే కొందరు అది దైవప్రేరితమైనది కాదని దాని లేఖకులు వారి కాలమందలి ఆచారములను వారి ఉద్దేశములను మాత్రమే అందు వ్రాసి రని, బైబిలు చెప్పు అనేక సంగతులు కట్టుకథలని చెప్పుచు, వారు దానియందున్న అద్భుతములను కూడా నిరాక రింతురు.

అది దైవ ప్రేరితమైనదని బైబిలు చెప్పుకొనుచున్నది. అది దేవుని వాక్యమై యున్నదని చెప్పుకొనుచున్నది. మోషే వ్రాసిన వ్రాతలన్నిటిలో దేవుడు అవన్నియును (అతనికి)వివరించి చెప్పెనని మనకు తెలియ జేయుచున్నది (నిర్గమ20:1). మరియు మోషే యెహోవా మాటలన్నిటిని వ్రాసెను (నిర్గమ 24:4). "అవన్నియును యెహోవా ఆజ్ఞాపించిన విధులు" (నిర్గమ 35:1).

"యెహోవా ఆత్మ నా ద్వారా పలుకుచున్నాడు ఆయన వాక్కు నా నోట ఉన్నదని" దావీదు చెప్పెను (2సమూయేలు 23:2).

"యెహోవా మాటలాడుచున్నాడు. ఆకాశమా, ఆలకించుము; భూమీ, చెవియొగ్గుము" అని యెషయా చెప్పెను (యెషయా 1:2).

"యెహోవా వాక్కు నాకు ప్రత్యక్షమాయెను" (యిర్మీయా 1:4).

"యేసుక్రీస్తు తన దాసులకు కనపరచుటకు దేవుడతనికనుగ్రహించిన ప్రకటన లేక ప్రత్యక్షతను" అతడు వ్రాసెనని యోహాను చెప్పెను (ప్రక 1:1).

"ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛను బట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింప బడినవారై దేవుని మూలముగా పలికిరి" (2పేతురు 1:21) అని పేతురు నుడివెను.

ఆఖరిగా, అపొస్తలుడైన పౌలు గలతీయులకు వ్రాసిన పత్రికలోని సంగతిని గమనించుదము: "సహోదరులారా, నేను ప్రకటించిన సువార్త మనుష్యుని యోచన ప్రకారమైనది కాదని మీకు తెలియజెప్పుచున్నాను. మనుష్యుని వలన దానిని

నేను పొందలేదు, నాకెవడును దాని బోధింపను లేదుగాని యేసుక్రీస్తు బయలు పరచుట వలననే అది నాకు లభించినది" (గలతీ 1:11,12).

బైబిలు లేఖకులు దానికి గ్రంధకర్తలమని ఇసుమంత యును చెప్పుకొనక వారి వ్రాతలన్నియును దైవావేశముచే కలిగినవని చెప్పుటలో ఏకమై యున్నారు. అది అంతయును బైబిలుకు అనుకూలముగా భావించబడిన సంగతులేయని అంగీకరించినను, మిగతా వాదమంతటిని పైన చెప్పబడిన ఆరోపణల మీద మాత్రము మేముంచుట లేదు. బైబిలు వ్యతిరేకులతో సహృదయత కలిగి యుండుటకు, బైబిలు గ్రంధకర్తలు మానవులు మాత్రమే యని వారు చెప్పు కొన్ని సూత్రములను పరిశీలించుట కొరకు ఒక ప్రశ్నను వేయు దము. మనుష్యులు దానిని వ్రాసిరా ?

అయితే ఏ తరగతివారు ? ఆత్మీయ నైతిక సూత్రము లను బట్టి మానవలోకమంతయును సజ్జనులు దుర్జనులు, నీతిమంతులు అనీతిమంతులవి రెండు విధములుగ చేయ నగును. అందుచే ఏ తరగతి మనుష్యులు దానిని వ్రాసిరి? అని మరల ప్రశ్నింపనగును. సజ్జనులు దానిని వ్రాసిరా? దానిని నిజముగా సజ్జనులే వ్రాసినట్లయితే వారు బైబిలు ద్వారా లోకమంతటిని స్పష్టముగా మోసగించిరని నిష్పక్షపాతి యైన ప్రతి అవిశ్వాసియు తెలిసికొనగలడు. నైతికముగా అది అసాధ్యమని కూడ గ్రహించ గలడు. సజ్జనులు అబద్ద మాడగలరా ? లేక అబద్ధికులు సజ్జనులు కాగలరా ?

బైబిలును వ్రాసినవారు దుర్జనులా? అవిశ్వాసులు ఇక్కడ కూడ సందిగ్ధా వస్థలో పడవలసి వచ్చుచున్నది. ఏదైనా ఒక సంగతి బైబిలునందు స్పష్టముగా నిలిచియుంటే. అది పాపము యెడల దాని అసమాన ద్వేషమే. పాపమును అసామాన్య పదములతో అది ఖండించుచు దానిని జరిగించు వారి శిక్షను అతి ఖచ్చితముగా చెప్పుచున్నది. పాపము యెడల దాని స్వభావమును తెలిసికొనుటకు క్రిందనీయ బడిన రెండువాక్యములు సరిపోగలవు: "యెహోవాకు అసహ్యములైనవి ఆరు గలవు. ఏడును ఆయనకు హేయములు - అవేవనగా అహంకార దృష్టియు

కల్లలాడు నాలుకయు, నిరప రాధులను చంపు చేతులును, దుర్యోచనలు యోచించు హృదయమును,కీడు చేయుటకు త్వరపడి పరుగులెత్తు పాదములును, లేనివాటిని పలుకు అబద్ధసాక్షియు, అన్న దమ్ములలో జగడములు పుట్టించు వాడును" (సామె 6:16-19). "పిరికివారును, అవిశ్వాసులును, అసహ్యులును, నర హంతకులును, విగ్రహారాధకులును, అబద్ధికు లందరును అగ్నిగంధకములతో మండు గుండములో పాలుపొందుదురు; ఇది రెండవ మరణము" (ప్రకటన 21:8).

ఒక ప్రశ్న :- ఈ గ్రంధమునువ్రాసినవారు ఎంత దుర్మార్గులైనను, వారు చేయుపాపములను ఖండించుచు, వాటివలన కలుగు కఠిన శిక్షను గూర్చి అందు వ్రాయగల రనుట యోగ్యమా ? ఈ ప్రశ్నలోనే దాని జవాబు ఇమిడి యున్నది. దుర్మార్గులు బైబిలును వ్రాసియుండలేరనియు, సన్మార్గులు దానిని వ్రాసి సన్మార్గులవలే యుండలేరనియు మనము చూచితిమి. దైవ ప్రేరేపణ లేక వ్రాయబడిన అనేక సంగతులతో బైబిలును పరిపోల్చి చూచిన అందు గొప్ప భేదము కన్పించును. బైబిలు గ్రంధకర్తలు మానవులే యని చెప్పు సిద్ధాంతములను అది కూలద్రోయు చున్నది. బైబిలును మనము అభివృద్ధి చేయలేము, దానికి సాటియైన దానిని సమకూర్చలేము.

దైవావేశపు కలమునకు యోహాను స్వస్తి చెప్పి ఇంచు మించు 2వేల సం॥లు కావొచ్చున్నది. బైబిలును ఆలనాటి మానవులే వ్రాసియుండిన యెడల, నేడు మానవులను భవించుచున్న అనేక పదుపాయములను బట్టి నేటి మానవులు మరింత మంచి బైబిలును వ్రాసియుండవలసినది గదా. కీ.శే. విల్లియం జెన్నింగ్స్ బ్రాయన్ అనునతడు చెప్పిన ఒక సంగతిని ఈ సందర్భములో చూచుకొందము:

"మానవ అంతస్థులను బట్టి నిర్ణయించిన యెడల బైబిలు వ్రాయబడిన కాలముకంటే నేడు మానవులు దానిని వ్రాయుటకు ఎంతో అభివృద్ధి చెందియున్నారు. ఎవరి మాటలు, చేతలు బైబిలునందు వ్రాయబడెనో, ఆ వ్యక్తు లందరూ ఒకే జాతికి చెందినవారు. నేడు మన దేశములకంటె ఏమంత పెద్దది

కాని ఒక దేశములో పాలస్తీనా కొండలలో వారు నివసించిరి. వారికి అచ్చు యంత్రములు లేవు. విశ్వ విద్యాలయములులేవు. చదువు కొనుటకు గొప్ప గొ గ్రంధాలయాలు వారికి నాడు లేవు. భూ నలుమూలలునుండి వార్తలనందించుటకు టెలిగ్రాఫ్ తీగలు, వార్తా పత్రికలను వారెరుగరు. పైన నక్షత్రములలోను, క్రిం బండలలోను గల రహస్యములను బయలు పరచుటకానాడు శాస్త్రమింకను త ప్రకృతి తలుపులను తెరవనే లేదు. నేటి అమిత విజ్ఞాన వికాసమును బట్టి చూ అతి మిక్కిలి సంకుచితమైన విజ్ఞాన గృహమునుండి వారు ఆయా సంగతుల గైకొనినను, ఈ బైబిలు వ్యక్తులు ప్రపంచ సృష్టి జరిగిన నాటినుండి సమా అనంతరపు మానవజాతి సంగతుల వరకు అన్నిటిని గూర్చి చెప్పుచున్నార మానవుని జననము నుండి మరణము వరకు గల ఒక చిత్రపటమును వా మనకిచ్చి యున్నారు. ఆ మార్గమందున్న ప్రతి అపాయకరమైన స్థలమును గూ మనకు చూపుడు బల్లల నుంచి యున్నారు. జాతీయచట్టము నకు పునాదిగ బైబిలునందలి "పది ఆజ్ఞలను", ఆత్మీయ సూత్రము లకు "క్రీస్తు కొండమీ ప్రసంగమును" మనము తప్పక అంగీకరించి వాటి సహాయమును గైకొ చున్నాము.

"నిర్దేవులును, నాస్తికులును వారికి సాధ్యమైతే మన కున్న బైబిలు కం శ్రేష్టమైన బైబిలు తయారు చేయగలరేమో చూద్దాం. వారి బడులలో నున్న మేధావు నందరినీ వారి నేర్పరచుకొననిమ్ము. వారి ప్రత్యేక సభ్యులు చూడదగిన స్థలముల చూడనిమ్ము. గ్రంధాలయములను పరిశోధింప నిమ్ము. వారిని జీవ, వృక్ష, జంత రసాయనిక, భౌతిక, భూగర్భ శాస్త్రములు మొదలగు వానినన్నిటిని పరిశోధిం నిమ్ము. కళలలోను, సాహిత్యములోను, చరిత్రలోను గల అభివృద్ధి నంతటి వారిని గైకొననిమ్ము. ఆయా శాఖలలోని విజ్ఞానసార మంతటితోను ఒ గ్రంధమును తయారుచేసి దానిని బైబిలుకు బదులుగా వారిని లోకము కీయనిమ్ము! బయలు దేవతా ప్రవక్తల వంటి విశ్వాసము వారికి గలదా? అస వారాలాగున ప్రయత్నించ గలరా? లేని యెడల వారేమని సాకు చెప్పగలరు మానవుడు 2వేల సంవత్సరముల క్రితమతడున్నట్టి స్థాయినుండి క్రిం

పడిపోయెనా? లేక మానవుని కంటే ఉన్నతమైన స్థావరము నుండి బైబిలు మనకు లభించెనా? - ఇందులో ఏమి ? (సశేషం)

- జాషువా గూటం.

సంఘచరిత్ర :

# మతశాఖల బోధకును బైబిలు బోధకును గల వ్యత్యాసములు - 1

( Differences between Denominational Doctrines and the Bible Teachings )

ఈ వ్యాసములో మతశాఖల కొన్ని బోధలను క్షుణ్ణంగా పరిశీలించి బైబిలులో వాటిని పోల్చి చూచుటకు ప్రయత్నించెదము. ఇందులో ఉదహరింపబడిన సిద్ధాంతములన్నీ అన్ని మతశాఖలవారు బోధింపకపోయినను, ఈ బోధలు విశ్వ వ్యాప్తముగా ప్రబలియున్నాయి. వాటిని అనుసరింపని మతశాఖలపై సయితము వాటి ప్రభావమును పరికించగలము. ఈ వ్యాసములో చర్చించబడిన 7సిద్ధాంతములు, సంస్కరణోద్యమము యొక్క ఆరంభములో బలముగా వేళ్ళునాటుకొన్నాయి. మార్టిన్‌లూథరు, జాన్‌కేల్విన్‌ల పలుకుబడి చొప్పున 'అవి ముఖ్యంగా రూపుదిద్దుకొన్నాయి. మొదటి రెండు సిద్ధాంతములకు మార్టిన్ లూథరును, మూడవదానికి జాన్ కేల్విన్‌ను కేథలిక్కులనుండి సేకరించారు. ఆఖరి నాలుగింటికి జాన్‌కేల్విన్ కారకుడు. ఈ సిద్ధాంతములెట్లుద్భవించాయో, ఒకటి మరొకదానికి ఎట్లు దారితీసిందో తెలిసికొనడానికి ప్రయత్నించుదాం.

## 1. విశ్వాసము వలన మాత్రమే రక్షణ

విశ్వాసము వలన మాత్రమే (Faith only) రక్షణయను సిద్ధాంతమును మొదటిగా మార్టిన్ లూథరు బోధించెను. కేథలిక్కు సంఘమును వ్యతిరేకించుటకు గాను అతడు దానిని బోధించెను. కేథలిక్కులు పుణ్యాకార్యముల యందు నమ్మిక

కలవారు. అలాగ కాదుగాని విశ్వాసము వలన మాత్రమే రక్షణ సంభవించునని లూథరు చెప్పాడు. అయితే విశ్వాసము వలన మాత్రమే రక్షణ కలుగునా ?

బైబిలు బోధ :

క్రియలు లేని విశ్వాసము రక్షించదు (యాకోబు 2:14).

క్రియలు లేని విశ్వాసము మృతము (యాకోబు 2:17,26).

విశ్వాసము మాత్రమే రక్షించగలిగితే, దయ్యములు కూడా రక్షింపబడును. ఏలయనగా అవి నమ్మి వణకుచున్నవి (యాకోబు 2:19).

క్రియల మూలముగా విశ్వాసము పరిపూర్ణమగును (యాకోబు 2:22).

మనుష్యుడు విశ్వాసమూలమున మాత్రము నీతిమంతుడుగా యెంచ బడడు. (యాకోబు 2:24).

విశ్వాసము దేవుని బిడ్డయగుటకు అధికారమునను గ్రహించును (యోహాను 1:12).

మనము విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షింపబడియున్నాము. అది క్రియల వలన కలిగినది కాదు. గనుక ఎవడును అతిశయపడలేదు (ఎఫెసీ 2:8, 9).

సత్క్రియలు చేయుటకై మనము క్రీస్తు యేసునందు సృష్టింపబడినవారమై ఆయన చేసిన పనియై యున్నాము (ఎఫెసీ 2:10).

మనము దిగువ సంగతులవలన నీతిమంతులుగా తీర్చబడుదుము :

| | |
|---|---|
| దేవుని వలన | రోమా 8:33 |
| క్రీస్తు వలన | అపో.కా. 13:39 |
| విశ్వాసము వలన | రోమా 5:1 |
| క్రీస్తు రక్తము వలన | రోమా 5:9 |
| క్రీస్తు నామము వలన | Iకొరింథీ 6:11 |

కృప వలన తీతు 3 : 7

క్రియల వలన యాకోబు 2 : 24

**మతశాఖల బోధ :**

రోమా 3:28 ని మార్టిన్ లూథరు యిట్లు అనువదించెను : "కాగా ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలు లేకుండ విశ్వాసము వలన మాత్రమే మనుష్యులు నీతిమంతులుగా తీర్చబడుచున్నారు". (మాత్రమే అను మాట ఆదిమ లేఖనాల్లో లేకపోయినను, లూథరు ఆ మాటను చేర్చెను).

"మనము విశ్వాసము వలన మాత్రమే నీతిమంతులుగా తీర్చబడుదుమను నది, హిత బోధయును, సుఖముతో కూడిన సిద్ధాంతమునై యున్నది" (Methodist Discipline, Art :9).

అనేక మతశాఖలవారు ఈ సిద్ధాంతమును అంగీకరింతురు.

మానవజాతికి మార్టిన్ లూథరు ఎంతో గొప్పమేలు చేసాడు. దానినెవరు కాదనలేరు. రోమన్ కేథలిక్కుల బంధకములను త్రెంచుటలో అతని నాయకత్వము గొప్పది. శ్లాఘనీయమైనది. లోకానికి ఆశీర్వాదకరమైనది. అయితే అతని నామమును, సిద్ధాంతమును ఎందుకు ఘనపర్చాలి ? లూథరు ఎవరి పాపముల కొరకూ మరణించలేదు. లూథరు పేరున ఎవరూ బాప్తిస్మము పొందలేదు. అతడెవరికీ నిత్యజీవాన్ని ఇయ్యలేడు. అతని సిద్ధాంతము అసత్యమైతే దాన్ని ఎందుకు కాపాడాలి ? మనము లూథరు వైపుగాక. "మన విశ్వాసమునకు కర్తయు దానిని కొనసాగించువాడైన యేసు వైపు" చూడాలి. విశ్వాసము వలన మాత్రమే రక్షణ యను బోధ నాశనానికి నడుపును.

## 2. రక్షింపబడుటకు బాప్తిస్మము అవుసరం లేదు

విశ్వాసము వలన మాత్రమే రక్షణ యను సిద్ధాంతము రైటయితే,

రక్షింపబడుటకు బాప్తిస్మము అవుసరం లేదని సునాయాసంగా చెప్పే యొచ్చు. అందులోను బాప్తిస్మము ఒక క్రియయని భావించిన యెడల దానికి ప్రాముఖ్యత యేమీ ఇయ్యనక్కరలేదు. అయితే రక్షింపబడుటకు బాప్తిస్మము అవుసరమా?

బైబిలు బోధ :

"నమ్మి బాప్తిస్మము పొందిన వాడు రక్షింపబడును" (మార్కు 16 : 16)

"మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి" (అపొ. కా. **2 : 38**).

"గనుక నీవు తడవు చేయుట ఎందుకు ? లేచి ఆయన నామమును బట్టి ప్రార్ధన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగి వేసుకొనుము" (అపొ.కా. 22:16).

"దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది" (1 పేతురు 3 : 21).

మతశాఖల బోధ :

విశ్వాసము వలన మాత్రమే రక్షణ యను సిద్ధాంతమును మతశాఖలు అంగీకరించినందున రక్షణ పొందుటకు బాప్తిస్మము అవుసరం లేదని బోధింతురు.

గమనిక : పూర్వక్రియల వలన రక్షణ కలుగునని కేథలిక్కులు చేయు బోధకు వ్యతిరేకముగా విశ్వాసము వలన మాత్రమే రక్షణయను సిద్ధాంతమును మార్టిన్ లూథరు ప్రవేశపెట్టెను. బాప్టిస్టు డినామినేషన్ వారు శుద్ధిచేసే శక్తి నీటిలో యేమీలేదని వాస్తవమునే చెప్పుచు రక్షింపబడుటకు బాప్తిస్మము అవుసరం లేదని యందురు. పాపములను కడిగివేసే శక్తి నీటిలో కాదుగాని క్రీస్తు మాటలో యున్నది. బాప్తిస్మము

క్రీస్తు యిచ్చిన ఆజ్ఞయై యున్నది. ఆయన మాటలకు లోబడుటలో రక్షణ యున్నది. బాప్తిస్మమును గూర్చిన మర్మము అంతా మనకు అర్ధము కాక పోయినను, ప్రభువు ఆజ్ఞ యిచ్చారు గనుక దానికి నేను లోబడుదుననుకొనుట చాలును. గనుక

సువార్తకు లోబడుట అవుసరమా ?

"దేవుని సువార్తకు అవిధేయులైన వారి గతి యేమవును?" అని పేతురు అడుగు చున్నాడు (1 పేతురు 4 : 17)

"ప్రభువైన యేసు... దేవుని నెరుగని వారికిని, మన ప్రభువైన యేసు సువార్తకు లోబడని వారికిని ప్రతిదండన చేయునని" పౌలు చెప్పుచున్నాడు (2థెస్స 1:7-8).

యేసుక్రీస్తు తనకు విధేయత చూపిన వారందరికీ నిత్యరక్షణకు కారకుడాయె నని హెబ్రీ పత్రిక లేఖకుడు నుడివియున్నాడు (హెబ్రీ 5 : 9).

"యాజకులలో అనేకులువిశ్వాసమునకు లోబడిరి" (అపొ. కా. 6 : 7). అనగా బాప్తిస్మము పొందిరి.

"సమస్తమైన అన్యజనులు విశ్వాసమునకు విధేయులగునట్లు ... " అని వ్రాయబడి యున్నది. విశ్వాసమునకు విధేయులగుట, సువార్తకు లోబడుట, బాప్తిస్మము పొందుట ఈమూడు ఒక్కటే.

గమనిక : సువార్తకు లోబడుట ప్రాముఖ్యము గనుక, సువార్త అనగా ఏమిటి ? సువార్త యొక్క నిర్వచనమును 1 కొరింథీ 15 : 1-4 లో మనము కనుగొనగలము. క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతిబొందెను, సమాధి చేయబడెను, లేఖనముల ప్రకారము మూడవదినమున తిరిగి లేచెనను వాస్తవములే సువార్త. ఈ వాస్తవముల ఉపదేశక్రమమునకు మనము లోబడాలి అని రోమా 6:17-18 లో చెప్పబడి యున్నది.

క్రీస్తుయొక్క మరణసమాధి పునరుత్థానములే ఆ ఉపదేశక్రమము. క్రీస్తు మన పాపముల నిమిత్తము చనిపోయెను. మనముమ మన పాపముల విషయమై మృతిజెందాలి, అనగా మారుమనస్సు పొందాలి. పాపములకు మనకు ఎడబాటు కలగాలి. క్రీస్తు సమాధిచేయబడెను. మనము బాప్తిస్మము నీటిలో సమాధి చేయ (ముంచ) బడాలి. క్రీస్తు సమాధి నుండి తిరిగి లేచినట్లు తండ్రి కుమార పరిశుద్ధాత్మ నామమున మనము ఆ నీటి సమాధినుండి తిరిగి లేపబడాలి. ఈ రీతిగ మన విశ్వాసమునకు లోబడగలము. విశ్వాసము రక్షించును. అయితే విధేయత గల విశ్వాసము రక్షించును (రోమా 16:25), రోమా 6:17-18 ని కూడ జాగ్రత్తగా చదవండి.

## 3 బాప్తిస్మమిచ్చే విధానము ప్రాముఖ్యము కాదు.

విద్యావేత్తలందరు బాప్తిస్మమనగా నీటిలో ముంచడమేయని అంగీకరింతురు. అయితే శిశువులు ఆదిమ పాపముతో జన్మింతురనే అసత్య సిద్ధాంతము వలన, పసిబిడ్డలను నీటిలో పూర్తిగా ముంచుట అసాధ్యమాయెను. అందువలన బాప్తిస్మమిచ్చే విధానము మానవులచే మార్చబడెను. చిలకరింపు వగయిరాలను అధికారయుక్తముగా గుర్తించుటకు కేథలిక్కులకు ఇంచుమించు వెయ్యి సంవత్సరములు పట్టెను. (క్రీ.శ. 251లో నోవేషన్ అనునతడు మొదటిగా చిలకరింపు పొందెను. అయితే 1311లో రావెన్నలో జరిగిన సభలో దీనిని అధికార పూర్వకముగా కేథలిక్కు సంఘము ఆమోదించెను). బాప్తిస్మ విధానముపై ఏకీభవించని వారు 1054లో కేథలిక్కుల నుండి Eastern Orthodox లేక గ్రీకు ఆర్థోడాక్స్ సంఘముగా చీలిపోయిరి. అయితే సంస్కరణ కర్తలు (బాప్టిస్టు డినామినేషన్ వారు తప్ప) చిలకరించే పద్ధతిని ప్రశ్నించనేలేదు. గాని :

బాప్తిస్మము ముంచడమేనా?

బైబిలు బోధ :

| | |
|---|---|
| బాప్తిస్మములో నీళ్ళున్నచోటునకు రావాలి. | అపొ.కా. 8:38 |
| బాప్తిస్మములో నీళ్ళలో దిగాలి. | అపొ.కా. 8:38 |

| | |
|---|---|
| బాప్తిస్మములో విస్తారమైన నీళ్ళు కావాలి. | యోహాను 3:23 |
| బాప్తిస్మములో నీటిలోనుండి వెడలి రావాలి. | అపొ.కా. 8:39 |
| బాప్తిస్మము ఒక సమాధి. | రోమా 6:4 |
| బాప్తిస్మములో పాతిపెట్టబడాలి. | రోమా 6:5 |
| ఒకే ఒక్క బాప్తిస్మమున్నది. | ఎఫెసీ 4:5 |

బాప్తిస్మమును గూర్చి లూథరు చెప్పిన మాటలతో ప్రతి విద్యావేత్త ఏకీభవించును. అతడిట్లు చెప్పాడు. "మొదటిగా బాప్తిస్మము ఒక గ్రీకు పదము. లాటిన్‌లో దానిని ముంచుట యని అనువదించవచ్చును. మనము దేనినైనా నీటిలో ముంచినప్పుడు అది నీటిలో సంపూర్ణముగా కప్పబడునట్లు ముంచుట యనే భావము దానిలో యున్నది" (Thompson, page 39).

**మతశాఖల బోధ :**

ప్రభురాత్రి భోజన విధానము ఎట్లు ప్రాముఖ్యము కాదో బాప్తిస్మమిచ్చే విధానము అంత ప్రాముఖ్యము కాదని లూథరనుల భావం.

యితర మతశాఖల వారు కూడా ఏవిధముగా బాప్తిస్మమిచ్చినను పరవాలేదని చెప్పుదురు.

గమనిక : ఎవరు బాప్తిస్మము పొందాలో, ఎట్లు బాప్తిస్మము పొందాలో యను అంశములపై బైబిలు సవిస్తరముగ బోధించుచున్నది. 'ఆదిమ పాపము' అనే అబద్ధబోధ వలన ముంచడాన్ని తప్ప వేరే విధానాన్ని ఎవరు అంగీకరించి యుండక పోదురు. అయితే బాప్తిస్మము యొక్క ప్రయోజనాన్ని సరిగ అర్థము చేసికొన్నప్పుడు, దానిని గూర్చిన బోధ సులువుగా గ్రాహ్యమగును. (మిగతాది వచ్చే సంచికలో)

—— 0 ——

# రక్షణకు విధేయతతో కూడిన విశ్వాసము అవుసరమా ?

విధేయత విశ్వాసము ఈ రెండింటిలో ఏది లోపించిన రక్షణ కలుగదని తెలుసుకొన గోరుచున్నావా ?

ఉదాహరణ : రైలు రెండు పట్టాలు మీద గమ్యస్థానము చేరుటకు క్షేమముగా ప్రయాణించును.

రక్షణకు విశ్వాసమొక్కటి మాత్రమే చాలునా? విధేయత కూడా అవుసరమా? "మీరు విశ్వాసము ద్వారా, కృపచేతనే రక్షింపబడియున్నారు" (ఎఫెసీ 2:5) రక్షణకు కృప ఒక్కటి మాత్రమే చాలునా ? విశ్వాసము కూడా అవుసరమా ? విశ్వాసమొక్కటి మాత్రమే చాలునా ? బాప్తిస్మము అక్కర్లేదా ? విశ్వాసము, మారు మనస్సు, ఒప్పుకొనుట రక్షణ శరతులలో భాగములు మాత్రమే (మార్కు 16:16), (మార్కు 10:9,10). బాప్తిస్మమును తిరస్కరించువారు శిక్షార్హులే.

## క్రీస్తు యొక్క విధేయత :

"ఏలయనగా ఒక మనుష్యుని అవిధేయత వలన అనేకులు పాపులుగా ఏలాగు చేయబడిరో ఆలాగే ఒకని విధేయత వలన అనేకులు నీతిమంతులుగా చేయబడుదురు" (రోమా 5 :19) "మరియు ఆయన ఆకారమందు మనుష్యునిగా కనబడి మరణము పొందునంతగా అనగా సిలువ మరణము పొందునంతగా విధేయత చూపినవాడై తన్నుతాను తగ్గించుకొనెను" (ఫిలిప్పీ 2:8).

"ఆయన కుమారుడై యుండియు తాను పొందిన శ్రమల వలన విధేయత నేర్చుకొనెను (హెబ్రీ 5:8).

విధేయత దేవునికి చూపించవలెను.

లోతు భార్యను జ్ఞాపకము చేసుకొనుడి (లూకా 17:32). "అయితే లోతు భార్య అతని వెనుకనుండి తిరిగి చూచి ఉప్పు స్థంభమాయెను" (ఆదికాండము 19:26).

**విధేయత వలన కలిగే ఫలములు.**

"అబ్రహాము పిలువబడినప్పుడు విశ్వాసమును బట్టి ఆ పిలుపునకు లోబడి తాను స్వాస్థ్యముగా పొందనైయున్న ప్రదేశమునకు వెళ్ళెను" (హెబ్రీ **11 : 8**).

**విధేయత బలులునర్పించుటకంటే శ్రేష్టమైనది.**

"అందుకు సమూయేలు - తాను సెలవిచ్చిన ఆజ్ఞను ఒకడు గైకొనుట వలన యెహోవా సంతోషించునట్లు ఒకడు దహన బలులను, బలులను అర్పించుట వలన ఆయన సంతోషించునా? ఆలోచించుము. బలులు అర్పించుటకంటే ఆజ్ఞను గైకొనుటయు, పొట్టేళ్ళ క్రొవ్వు అర్పించుటకంటే మాట వినుటయు శ్రేష్టము" (1సమూయేలు 15:22).

## విశ్వాసము యొక్క విధేయత.

"ఈయన నామము నిమిత్తము సమస్త జనులు విశ్వాసమునకు విధేయులగునట్లు ఈయన ద్వారా మేము కృపను అపొస్తులత్వమును పొందితిమి" (రోమా 1:1-7).

**విధేయత దేవుని కుమారునికి చూపించవలెను.**

"కుమారుని యందు విశ్వాసముంచు వాడే నిత్యజీవము గలవాడు, కుమారునికి విధేయుడు కాని వాడు జీవము చూడడు గాని దేవుని ఉగ్రత వాని మీద నిలిచియుండును" (యోహాను 3:36).

**దేవుడు విధేయతను కోరుచున్నాడు.**

"అయితే బేధములు పుట్టించి సత్యమునకు లోబడక దుర్నీతికి లోబడు వారిమీదికి దేవుని ఉగ్రతయు రౌద్రమును వచ్చును" (రోమా 2:8).

I పేతురు 3:19-20 అవిధేయులు నశించిరి. బాప్తిస్మమును తిరస్కరించు వారు నశింతురు.

"మీరు సంపూర్ణ విధేయత కనుపరచినప్పుడు సమస్తమైన అవిధేయతకు ప్రతిదండన చేయసిద్ధపడియున్నాము" (II కొరింథీ 10:6)

"మీరు బాగుగా పరుగెత్తుచుంటిరి. సత్యమునకు విధేయులు కాకుండ మిమ్మును ఎవడు అడ్డగించెను" (గలతీ 5:7).

"సమస్తమైన అన్యజనులు విశ్వాసమునకు విధేయులవునట్లు అనాదినుండి రహస్యముగా ఉంచబడి యిప్పుడు ప్రత్యక్ష పరచబడిన మర్మము నిత్యదేవుని ఆజ్ఞ ప్రకారము ప్రవక్తల లేఖనముల ద్వారా వారికి తెలుపబడియున్నది. ఈ మర్మమును అనుసరించి యున్న నా సువార్త ప్రకారము గాను యేసుక్రీస్తును గూర్చిన ప్రకటన ప్రకారము గాను మిమ్మును స్థిరపరచుటకు శక్తిమంతుడును, అద్వితీయ జ్ఞానవంతుడైన దేవునికి, యేసుక్రీస్తు ద్వారా నిరంతరము మహిమ కలుగును గాక. ఆమెన్" (రోమా 16 : 25-27).

ఆర్. సమూయేలు, అమలాపురం.

# జన్మపాపము

క్రైస్తవ బోధకులు కొందరు తాము చేయు బోధలలో "మనము కర్మపాపము నుండియు, జన్మపాపము నుండియు విడుదల పొందవలయును" అను మాటలు అనాలోచనగ విసరివేయుదురు. కర్మపాపమును గూర్చి బైబిలు మొదటి నుండి చివర వరకు ఘోషించుచున్నది గాని జన్మపాపమును గూర్చి ఎచ్చటను చెప్పుటలేదే. బైబిలులో జన్మపాపము గలదని నమ్మువారు చెప్పునదేమన-"మనం ఆదాము సంతతివారము గాన తరతరములు అతని పాపము పయనించి మన తల్లిదండ్రు లకును వారి నుండి మనకును సంక్రమించినది. అందుచే మనము జన్మ నుండియే పాపులమైతిమి".

జన్మచే ఆదాము పాపము మనకు సంక్రమించినదా లేదా ఆ పాప ఫలితము మనకు సంక్రమించినదా ? ఈ రెంటికిని గల వ్యత్యాసము మనము జాగ్రత్తగ గుర్తించవలయును. ఆదాము పాప ఫలితం మరణము. ఆ మరణములో మనము

పాలి భాగస్తులము, గాని అతని పాపములో మనకు పాలులేదు. ఒకడు త్రాగుబోతై ఆ మత్తులో మరొకని హత్య చేసినాడు, ఖైదు పాలైనాడు. తండ్రి సంపాదనపై ఆధారపడిన బిడ్డలు దారిద్ర్యమునకు గురియైనారు. అతని పాప ఫలితము "లేమి". ఆ లేమినే వారు అనుభవింపవలసి యుందురు గాని తండ్రి పాపమును బట్టి బిడ్డలు త్రాగుబోతులని, నరహంతకులని పిలువబడరు.

మనము జన్మము నుండియు పాపులముకాము అని సూచించు కొన్ని బైబిలు వాక్యములు చూతము.

1. దేవుడు నరులను యథార్థవంతులుగా పుట్టించెను గాని వారు వివిధములైన తంత్రములు కల్పించుకొని యున్నారు (ప్రసంగి 7:29).

ఈ వాక్యములో మనము స్పష్టముగ చూచునదేమి ? పాపముతో మనము జన్మించలేదనియే గదా. ఈలోకమందు జన్మించు ప్రతివాడు దొంగ బిడ్డగాని, దొర బిడ్డగాని ప్రతివాడు నిర్దోషియే.

2. మన ప్రభువైన యేసు చెప్పునదేమి ? "చిన్న బిడ్డలను ఆటంక పరచక నా యొద్దకు రానీయుడి. పరలోక రాజ్యము ఈలాటివారిదే (మత్తయి 19:14). పరలోక రాజ్యమునకు అర్హులెవరు ? పరిశుద్ధులు. అటువంటి పరిశుద్ధ హృదయము కలిగినవారు చిన్నబిడ్డలు అని యేసుప్రభువు చెప్పుచున్నాడు. కనుక జన్మపాపమెక్కడ ?

3. కుమారులు యెహోవా అనుగ్రహించిన స్వాస్థ్యము. గర్భఫలము ఆయన యిచ్చు బహుమానమే (కీర్త 127:3). దేవుడు మనకిచ్చు బహుమానము శ్రేష్టమైనది, పాపరహితమైనది.

4. హెబ్రీ 12:9లో మనకు రెండు రకములైన తల్లిదండ్రులు గలరు అని చెప్పుచున్నాడు-1) శరీర సంబంధులైన తల్లిదండ్రులు 2) ఆత్మలకు తండ్రియైన దేవుడు. శరీర సంబంధులైన తల్లిదండ్రుల ద్వారా మనకు శరీరము దొరికినది. ఆత్మల తండ్రియైన దేవుని వలన మనకు ఆత్మ అనుగ్రహింపబడినది. ఆయన వలన మనము పొందిన ఆత్మ పరిశుద్ధ మైనదా, పాపసహితమైనదా ?

5. ఈ పై వాక్యములో గల భావమే ప్రవక్తయైన జెకర్యా మరొకరీతిని చూపు చున్నాడు- 12:1వచనములో "మనుష్యుల అంతరంగములో జీవాత్మను సృజించు యెహోవా సెలవిచ్చున దేమన"-

ఈ వాక్య భావమేమి ? మన తల్లిదండ్రులు మనకు శరీరమునివ్వగా దేవుడు తన వంతునకు ఒక్కొక్క బిడ్డకు ఒక్కొక్క జీవాత్మనిచ్చి యీ లోకమునకు పంపుచున్నాడు. అందువలన పుట్టిన ప్రతి బిడ్డ పరిశుద్ధుడే లేక నిర్దోషియే.

6. ఇస్సాకు కుమారులైన ఏశావు యాకోబులను గూర్చి వ్రాయబడినదేమి ? "పిల్లలింకను పుట్టి మేలైనను, కీడైనను చేయకముందే..." (రోమా 9:10-12) ఈ మాటల భావమేమి ? పుట్టబోవు బిడ్డలలో దోషమేమియు లేదనియే గదా !

పైన చూపబడిన వాక్యములను బట్టి మనము నిశ్చయించునదేమి ? జన్మ పాపమనునది లేదనియే గదా. జన్మపాపము గలదని చెప్పువారు బైబిలునుండి ఒకే వాక్యము నెత్తి చెప్పుదురు-కీర్తన 51:5. దావీదు తాను జరిగించిన పాపమును గూర్చి గద్దింపబడినవాడై పశ్చాత్తాపముతో కృంగి ఈ కీర్తన వ్రాసినాడు. "నేను పాపములో పుట్టినవాడను. పాపములోనే నా తల్లి నన్ను గర్భము ధరించెను". ఈ వాక్యము నుండి దావీదు తన తల్లి గర్భము నుండి పాపముతో జన్మించినాడని అర్థము తీయుదురు. మనమీ వాక్యము జాగ్రత్తగ పరిశీలించిన దావీదు తాను **పాపములో** జన్మించితినని చెప్పుకొనుచున్నాడు గాని **పాపముతో** జన్మించెనని చెప్పలేదు అని తేటగ గ్రహింపవలెను.

తన కుటుంబ పరిస్థితులను తలంచుకొని తన్ను తాను నిందించుకొన్నాడు. అంతియేగాని తల్లి గర్భము నుండి వచ్చినపుడే పాపముతో వచ్చినానని చెప్పలేదు. తాను పాపముతో జన్మించితినని నమ్మియుండిన, తాను జరిగించిన పాపమునకు తల్లినే నిందించి యుండును, కాని ఈ కీర్తన అంతయు మనము చదివినపుడు, దావీదు తన్నే నిందించుకొన్నట్లు స్పష్టమగుచున్నది.

One Volume Peak's Commentary లో ఈ వ్యాఖ్యానమున్నది. "ఈ కీర్తన వ్రాసినవాడు అందరివలెనే పాపముతో నిండిన వంశము నుండి జన్మించి తినని చెప్పుచున్నాడు. మరియు అతని పాపమునకు కలిగిన శిక్ష న్యాయమైనదని ఒప్పుకొనుచున్నాడు. ప్రతివానిలో పాపము వైపు మొగ్గు నైజము గలదు. దానిని జన్మ పాపమని చెప్ప వీలులేదు".

Dr. O.M. Rao అను బాప్టిస్టు పండితుడిట్లు వ్రాయుచున్నాడు. "మానవ చరిత్రలో ఒకానొక కాలమందు పాపము ప్రవేశించినది. మన మందరమును పతనమైన మానవ జాతికి చెందినవారము. అంతలో పాపము జన్మ నుండి కలిగిన దని చెప్పవచ్చునా ? జన్మ పాపమును గూర్చిన భావములు బిషప్ సిప్రియన్ వ్రాతలలో తలయెత్తినవి. అతడు చిన్న బిడ్డలలో గల జన్మపాపమును తీసివేయుటకు వారికి బాప్తిస్మ మీయవలెనని వ్రాసినాడు. పాపము వైపు మొగ్గు నైజము మనకు గలదు గాని పాపముతో మనము జన్మించలేదు."

యిర్మియా, యెహెజ్కేలు ప్రవక్తలు ఇశ్రాయేలు జనాంగము జన్మపాపమను భావము వైపు మొగ్గుట గమనించినపుడు వారే అవసరమైన అడ్డంకులు వేసిరి. "తల్లిదండ్రులు ద్రాక్షకాయలు తినగ పిల్లలు పళ్ళు పులిసెనను మాట యిక చెప్పరు. ప్రతివాడు తన దోషము చేతనే మృతి నొందును. ఎవడు ద్రాక్ష కాయలు తినునో వాని పళ్ళే పులియును"-యిర్మి 31:23,30 మరియు యెహెజ్కేలు 18:4 చూడుడి. కనుక మన మీదికి వచ్చిన పాపమును గూర్చి మనము ఆదామును నిందించ నక్కరలేదు. మన పాపమునకు మనమే బాధ్యులము.

## జన్మపాపము - చిన్న బిడ్డల బాప్తిస్మము

మానవుడు జన్మ నుండియే పాపియను సిద్ధాంతము మరొక పొరబాటునకు దారి తీసినది. అది చిన్నబిడ్డల బాప్తిస్మము. దీనిని గూర్చి కొందరు "క్రైస్తవ భక్తులు" వ్రాసినది గమనింతము.

1. బాప్తిస్మము పొందని చిన్న బిడ్డలు చనిపోవుట తటస్థించిన రక్షణను పోగొట్టు కొందురు. Bishop Cyprin

2. చిన్న బిడ్డలకు పసితనమున బాప్తిస్మ మియ్యనిచో అగ్నిగంధకముల గుండములో వారు బహువేదనలు పొందవలసి వచ్చును St. Augustine

3. చిన్న బిడ్డల కిచ్చు బాప్తిస్మము వారి జన్మపాపమును కడిగివేయును గనుక వారికి తప్పక బాప్తిస్మ మీయవలెను. John Wesley

4. జన్మ పాపమను మురికినుండి చిన్న బిడ్డలు శుద్ధులు కావలసి యున్నారు. అందుచే వారికి బాప్తిస్మ మీయవలెను. Dr. Wall

లేని పాపమును చిన్న బిడ్డల కంటగట్టుట ఒక పొరబాటు. మరియు వారి పాప నివారణ కొరకని దైవ వాక్యములో లేని బాప్తిస్మమును సృష్టించి పాప మెరుగని వారి పాప నివారణకై వారిని దానికి లోను చేయుట మరొక పొరబాటు.

మానవ కల్పిత సిద్ధాంతములు మత చరిత్రలో ప్రారంభము నుండి మనుష్యులను కలత పరచుచున్నవి. మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని వారు చేయు బోధలు యెషయా దినములలో యూద సమాజమును కలత పెట్టినవి (యెష. 29 : 13). యేసుప్రభు దినములలో శాస్త్రులు, పరిసయ్యులను కలత పెట్టినవి... (మత్త. 15 : 9) నేటి దినములలో క్రైస్తవ లోకమును కలతపెట్టుచున్నవి. మార్టిను లూథరు మొదలగు సంస్కర్తలు రోమన్ సంఘములో గల తప్పు సిద్ధాంతముల ననేకమైన వాటిని విడచినను మనమిక్కడ చూచిన వాటిని విడువలేకపోయిరి. కారణమూహింపలేము.

## పాపమెట్లు కలుగును ?

ఇంత వరకు పాపము జన్మనుండి కలుగదు అని చూచితిమి. మరి పాపమేలాగు కలుగును ? కర్మవలననే. ఒక కార్యము మంచిదని, మరొకటి కాదని ఎట్లు నిర్ణయించగలము ?

పాప మననేమో చెప్పుటకు బైబిలు రెండు నిర్వచనములు చేయుచున్నది.

1. ఆజ్ఞాతి క్రమము పాపము - 1. యోహా 3 : 4 అనగా చేయవలసినది చేయక పోవుట. మనము ఏది చేయవలయునో, ఏది చేయకూడదో బైబిలే స్పష్టము చేయుచున్నది.

2. మేలైనది చేయు నెరిగియు ఆలాగు చేయని వానికి పాపము కలుగును- (యాకో 4 : 7) అనగా ఒక కార్యము మంచిది అని ఎరిగియుండియు అది చేయనిచో పాపమగును.

మానవులమైన మనము-- (చిన్న బిడ్డలతో సహా) మేలు, కీడుల మధ్య నున్నాము -- (రోమా 7 : 18) జీవన మరణముల మధ్యనున్నాము- (ద్వితి 30 : 15) దేవునికి, దయ్యములకును మధ్యనున్నాము-- (యెహూ 24:15) లేదా ఇరుకు విశాల మార్గముల మధ్యనున్నాము (మత్త 7:13,14). మనము పోవునది కుడి వైపునకా, ఎడమ వైపునకా ? ఏదో మనమే నిర్ణయించుకొనవలయును. మన భావి మన చేతులలోనే గలదు. అలాగే చిన్న బిడ్డయు పెరుగుకొలది ఏదో యొకవైపునకు పోవుటకతడే ఏర్పరచుకొనును. మంచి చెడ్డలనెరిగి ఏర్పరచుకొను వయస్సునకు యుక్త వయస్సు అందుము (Age of accountability). ఎరిగి అతడు తప్పు చేసినపుడే పాపియనబడును. అంతవరకు కాదు.

మనము దేవుని వాక్యమును ప్రేమించినచో ఆయన ఆజ్ఞలు గైకొందుము. వాక్యమందు లేని దానిని ఊహించి వాక్యము యొక్క స్థానములోనికి అట్టివి ప్రవేశపెట్టకుండునట్లు ప్రభువు మనలను నడిపించును గాక.

- టి. జ్ఞానానందం
క్రీస్తు సంఘము, కాకినాడ.

(కోడేరు), కె. శాంతారావ్ (ములకల్లంక), పి.జె. కృపాలిని (పలివెల) మరియు జాషువా గూటం గారు ఇయ్యబడిన అంశమును, అనగా "నేడు దేవుడు ఎట్లు మాట్లాడు చున్నాడు?" అను అంశమును చక్కగా విశ్లేషించిరి.

పూర్వకాలమందు నానా సమయములలో, నానావిధములుగా దేవుడు తన ప్రజలకు తన చిత్తమును తెలియజేసెను. గాని ఈ దినముల అంతమందు ఆయన తన కుమారుని ద్వారా మాట్లాడెను (హెబ్రీ 1:1). ఆయన చిత్తము క్రొత్త నిబంధనలో పరిపూర్ణముగా గ్రంధస్థము చేయబడి యున్నది. గనుక మనము లేఖనములను అతిక్రమింపకూడదు (1కొరింథీ 4:6). లిఖింపబడిన వాక్యమును చదువుట ద్వారా గాని లేదా వినుట ద్వారా గాని విశ్వాసము కలుగును. దేవుడు ఎవరితో ఎక్కడా ఈనాడు నేరుగా మాట్లాడుట లేదు. పాత నిబంధన కాలములోనే దేవుడు తమతో మాట్లాడుచున్నాడని చెప్పుకొనే వారిని గూర్చి తగు హెచ్చరికలు ఈయబడి యున్నవి (యెహెజ్కేలు 24:12; 13:6; యిర్మియా 29:8,9). ఎవడైనను దేవుని సేవించుటకు అబద్ధ సాక్ష్యములు చెప్పి ప్రజలను మళ్లించిన యెడల అట్టి "ప్రవక్తకేమి, ఆకలలు కనువానికేమి మరణశిక్ష విధింపవలెను. అట్లు నీ మధ్యనుండి ఆ చెడుతనమును పరిహరించవలెను" అని పాతనిబంధనలో ఆజ్ఞాపింపబడెను (ద్వితీ 13:5). "ఎందుకనగా దేవదూతల ద్వారా పలుకబడిన వాక్యము స్థిరపరచబడినందున ప్రతి అతిక్రమమును అవిధేయతయు న్యాయమైన ప్రతిఫలము పొందియుండగా, ఇంతగొప్ప రక్షణను నిర్లక్ష్యము చేసిన యెడల ఏలాగు తప్పించు కొందుము ?" (హెబ్రీ 2:2-3) అని సోదరులు వాక్యమును బట్టి హెచ్చరించిరి.

బెండపూడిలో సోదరులు పులగల సమర్పణరావ్ గారు వాక్య పరిచర్య చేయుచున్నారు. స్థానిక సంఘము, సమర్పణరావ్ గారి కుటుంబము వచ్చిన వారందరికీ మంచి ఆతిథ్యము నిచ్చిరి. కె. ప్రసాద్ గారి ప్రార్థనతో సదస్సు ముగిసెను.

2000 ఆగస్టు మొదటితేదీ మంగళవారం, రాజమండ్రి రామదాసుపేట ఏరియాలోని క్రీస్తుసంఘము యొక్క నిర్వహణలో బైబిలు విద్యా కేంద్రము ప్రారంభింపబడెను. ఈ విద్యా కేంద్రము రాజమండ్రి సుబ్బారావ్ నగర్‌లో, క్వారీ రోడ్‌లో యున్నది. బైబిలు విద్యా కేంద్రము యొక్క ప్రారంభము ఘనముగా జరిగెను. స్థానిక సంఘస్థులు, రాజమండ్రి పట్టణ సువార్తికులు, పలు ప్రాంతముల నుండి వచ్చిన సువార్తికులు, సోదరులతో విద్యా కేంద్రము యొక్క ప్రాంగణ అంతా నిండెను. సోదరి కబితా గూటం గారు రిబ్బరు కత్తిరించగా, జాషువా గూటం గారి ప్రార్థనతో విద్యా కేంద్రము తెరువబడెను. తదుపరి జరిగినకూటములో సోదరులు

E. అబ్రాహాము (తుని), యమ్. కిరణ్ కుమార్ (రాజమండ్రి), జాషువా గూటం గార్లు వాక్య పరిచర్య చేసిరి. సోదరులు జయపాల్ గారు అధ్యక్షత వహించి చక్కని సందేశముల నిచ్చిరి. ఈ బైబిలు విద్యా కేంద్రమును సంకల్పించి, నిర్వహించుటకు కృషి సల్పిన సోదరులు వి. సుదర్శనరావ్ గారిని, స్థానిక సంఘమును సహోదరులు అభినందించిరి. తదుపరి వచ్చిన వారందరికీ చక్కటి విందును స్థానిక సంఘము ఏర్పాటు చేసెను. రాజమండ్రిలో తెరువ బడిన బైబిలు విద్యా కేంద్రము ద్వారా అనేకులు సత్యవాక్యమును తెలిసికొని, క్రీస్తులోనికి నడిపించబడ గల్గునట్లు ప్రార్థించుదాం. రాజమండ్రిలో సోదరులు వి. సుదర్శనరావ్ గారు బహిరంగ సువార్త కూటముల ద్వారా, ఇంటింటా జరుపు బైబిలు తరగతుల ద్వారా, వ్యక్తిగతంగా బైబిలును బోధించుట ద్వారా అనేకులను క్రీస్తులోనికి నడిపించుచున్నారు. క్రీస్తు కొరకైన వారి కృషి ప్రసంశ నీయము.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02/99

From :
**SATYA VAKKU**
P.O. BOX 80,
KAKINADA - 533 001.

To

*Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani - Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St., KAKINADA - 533 004. Editor : Joshua Gootam*